క్లుప్తంగా

భారతీయ సంస్కృతిలో సంగీతం ఓ భాగం



సంగీతోత్సవంలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్యామలాసోనీ

పెనుగొండ: భారతీయ సంస్కృతి లో సంగీతం ఓ ముఖ్యమైన భాగమని, సాధన ద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చునని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ అన్నారు. శనివారం పెనుగొండ త్యాగరాజ గానసభలో నిర్వహించిన 40వ సంగీతోత్సవం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు మాట్లాడుతూ సంగీతానికి పెనుగొండకు విడదీయలేని అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో నూలి అనుపమా ప్రియదర్శిని, కె.మహాలక్ష్మి, గాయని నందన, త్యాగరాజన గాన సభ అధ్యక్షురాలు డాక్టర్ కలిదిండి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ చిక్కాల విజయశ్రీకి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

యలమంచిలి: ప్రభుత్వ విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం యూటీఎఫ్ నాయకులు తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ, ఎంఈఓ కనుమూరు వెంకట రామకృష్ణంరాజు, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పి సూర్యనారాయణరాజులకు వినతిపత్రం ఇచ్చారు. జీఓ 117 రద్దు చేసి జీఓ 55 ప్రకారం టీచర్లను కేటాయించాలని, పాఠశాలల విలీనాన్ని నిలిపివేసి ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు ఒకే పాఠశాల నడపాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్, మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

పెంకు పురుగులను అరికట్టాలి



పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తున్న హెచ్ఎం స్వర్ణలత

యలమంచిలి: అడవిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న ఎఫ్‌సీఐ గోడౌన్స్ నుంచి పెంకు పురుగులు రావడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని పెంకు పురుగులు అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత శనివారం పంచాయతీ కార్యదర్శి ఓదూరి మాధవికి ఫిర్యాదు చేశారు. పెంకు పురుగులు కళ్లలోకి వెళ్లడమే కాకుండా అవి కుట్టడం వల్ల దద్దుర్లు వచ్చి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వంట గదిలోనికి కూడా పురుగులు వ్యాపించి ఆహారం, మంచినీళ్లలో పడడం వల్ల విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినడం లేదని పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని లేదా గోడౌన్ యాజమాన్యానికి తగు సూచనలు చేసి పెంకు పురుగులను అరికట్టాలని కోరారు.

వైరల్ జ్వరాలపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కొడమంచిలి సర్పంచ్ సుంకర సీతారాం

పోడూరు: వైరల్ జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని కొడమంచిలి గ్రామసర్పంచ్ సుంకర సీతారాం ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఆయన సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా కురవడం తో పాటు నదీతీర ప్రాంతాల్లో వరదలు వస్తున్న నేపథ్యంలో వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఆరోగ్యసిబ్బందికి సూచించారు. అలాగే పాడి పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకునేలా వెటర్నరీ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి నాని, ఏఎస్ఎంలు పుష్పరాజ్యం, వెంకటరమణ, వెల్ఫేర్ అసిస్టెంట్ భవాని, అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు నవీన్, శ్రీదేవి, వెటర్నరీ డాక్టర్ సురేంద్రరెడ్డి, డీఏ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న వరి సాగు

ఆక్వా చెరువులుగా మారుతున్న పంట భూములు



మొగల్తూరులో నాట్లు వేస్తున్న కూలీలు(ఫైల్)

మొగల్తూరు: మండలంలో పచ్చని తివాచీ పరుచుకున్నట్లుండే భూములన్నీ చేపల చెరువులుగా, ఖాళీ స్థలాలుగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా సార్వా సాగు తగ్గిపోతున్నా దృష్టి సారించాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంతో పంట దిగుబడి తగ్గిపోతుంది. కాలువలు సకాలంలో వదిలినా శివారు ప్రాంతాలకు నీరందకపోవడంతో రైతులు సాగు పనులు చేపట్టలేదు. అయితే కొద్దోగొప్పో విత్తనాలు వేసుకున్న రైతులను భారీ వర్షాల వెంటాడంతో ఆకుమడులు మునిగి రైతులు ఆరంభంలోనే నష్టపోయారు.

తగ్గుతున్న వ్యవసాయం

మండలంలో ప్రతి ఏటా ఇంచుమించుగా దాళ్వా 5 వేల ఎకరాలు, సార్వా 4 వేల ఎకరాల్లో సాగు చేపడతారు. అయితే పంట నష్టాలు పెరిగిపోవడంతో వ్యవసాయ రైతులు ఆక్వా రైతులుగా మారిపోయారు. గతేడాది సార్వా సాగు 3200 ఎకరాల్లో చేపట్టగా ప్రస్తుతం అధికారుల అంచనాల ప్రకారం ఈ ఏడాది 980 ఎకరాల్లో సాగు చేపట్టవచ్చుని లెక్కలు వేస్తున్నారు. ఒకప్పుడు శేరేపాలెంలో 1500 ఎకరాల్లో సాగు చేపట్టగా ప్రస్తుతం 500 ఎకరాలకు తగ్గిపోయింది. ధాన్యాగారంగా పేరుగాంచిన రామన్నపాలెం అడవిపర్రులో 1800 ఎకరాలకు గాను 100 ఎకరాలకు తగ్గిపోయింది. కేపీ పాలెం, పేరుపాలెంలోనూ ఇదే పరిస్థితి. మొగల్తూరులో జాతీయ రహదారి విస్తరణ పుణ్యమాంటూ ఇరిగేషన్ నిబంధనలు పాటించకుండా తూరలు ఏర్పాటు చేయడంతో శివారు ప్రాంతాలకు నీరందక, చేలల్లో నిలిచిపోయిన నీరు బయటకు పోక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కాళీపట్నంలోను తగ్గిన విస్తీర్ణం

కాళీపట్నం గ్రామం గుండా ఉప్పుటేరు ఆనుకుని ప్రవహిస్తున్న మాగిలేరులో సుమారు 600 ఎకరాల్లో సాగు చేపట్టేవారు. అయితే లాకు శిథిలావస్థకు చేరుకున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో ఉప్పుటేరు నీరు చేలల్లోకి చేరి చవుడు బారిపోతున్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు రాక ఆర్థికంగా నష్టపోతున్న రైతులు చేపల సాగువైపు మొగ్గు చూపడంతో 300 ఎకరాలకు సాగు పడిపోయింది.

హత్యలు, అత్యాచారాలతోనే కూటమి పాలన



దేవ రాజేష్‌కుమార్

పాలకొల్లు అర్బన్: ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలను పక్కన పెట్టి హత్యలు, అత్యాచారాలతో కూటమి పరిపాలన సాగుతుందని వైఎస్సార్ యువజన విభాగం జిల్లా కార్యదర్శి దేవ రాజేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన పార్టీలు ప్రజలకు సంక్షేమ పాలన అందించడం లేదని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాల ప్రస్తావన లేకుండా హత్యా రాజకీయాలకు కూటమి ప్రభుత్వం తెరలేపి రాష్ట్రాన్ని అగ్నిగుండంలా మార్చిందని విమర్శించారు.

బియ్యం పంపిణీ

భీమవరం: భారీ వర్షాలు, వరదముంపునకు గురై ఇబ్బంది పడుతున్న భీమవరం పట్టణంలోని దుర్గాపురం ప్రాంతానికి చెందిన బాధితులకు శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో శనివారం బియ్యం పంపిణీ చేశారు.

మళ్లీ పెరుగుతున్న వశిష్ట గోదావరి



సిద్ధాంతంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



సిద్ధాంతం కేదారీఘాట్ వద్ద గోదావరి ఉధృతి

పెనుగొండ: తగ్గు ముఖం పట్టిన వశిష్టా గోదావరి ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో మళ్లీనీటి మట్టం పెరుగుతుంది. సిద్ధాంతం కేదారీఘాట్ వద్ద మరోసారి నీటి మట్టం నెమ్మదిగా పెరుగుతుంది. ఉధృతి తగ్గి గోదావరి తగ్గుతుండడంతో పరివాహక ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకొన్నారు. తగ్గుముఖం పట్టి 24 గంటలు కాకముందే తిరిగి పెరుగుతుండడంతో హడలిపోతున్నారు. ఎగువ ప్రాంతంలో వేగంగా నీటిమట్టం పెరుగుతుండడంతో ఈ సారి లంక గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడు వచ్చిన వరద కేవలం పంట పొలాలలను మాత్రమే ముంచిందని, రాబోయే ఉధృతి గ్రామాల్లోకి ప్రవేశించవచ్చునని ఆందోళన చెందుతున్నారు. గతంలో ప్రభుత్వం అన్ని విధాలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి అండగా నిలిస్తే, కొత్త ప్రభుత్వం మాత్రం ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో వరద ఉధృతిని ఎలా తట్టుకోవాలో అని భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికే పశుగ్రాసం కొరతతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోసారి వరద వస్తే ప్రజలూ ఇబ్బందులు పడే అవకాశం ఉంది. దీంతో త్వరగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని లంక గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బాలికలపై అత్యాచారాలను అరికట్టాలి



ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పాగాకు పూర్ణ డిమాండ్ చేశారు. ఆకివీడులో ఏడేళ్ల బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన ఘటనపై శనివారం ఐద్వా ఆధ్వర్యంలో రుస్తుంబాధలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ గత రెండు నెలల కాలంలో సుమారు 55 మంది బాలికలపై అత్యాచారాలు జరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. మహిళ హోమ్‌మంత్రిగా ఉన్న రాష్ట్రంలో ఇలాంటి ఘనటలు జరగడం దారుణమన్నారు. కార్యక్రమంలో సుధ, జ్యోతిక, గిరిజ, రూప తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతో ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జియావుద్దీన్

పాలకొల్లు సెంట్రల్: ప్రతి పౌరుడూ చట్టాలపై అవగాహన కలిగిఉండాలనే ఉద్దేశంతో న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేశారని పట్టణ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ జియావుద్దీన్ షేక్ అన్నారు. శనివారం స్థానిక డీఎన్నార్ మహిళా కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జడ్జి జియావుద్దీన్ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన చేసుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, న్యాయవాదులు అనంతలక్ష్మి సత్యవతి, ప్రసాద్, పి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 20 మంది ఎంపిక



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 20 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో హెటిరో ల్యాబ్స్ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాంగణ ఎంపికలో మొత్తం 56 మంది అభ్యర్థులు హాజరవ్వగా వారిలో 20 మంది ఎంపికయ్యారన్నారు. వీరికి నెలకు వేతనం రూ.25 వేలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహరావు, సెక్రటరీ కె.రామరాజు, కంపెనీ హెచ్ఆర్ నరేష్, వెంకట్, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ యు.జానకిరామయ్య, టి.మీనా తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు శ్రీరంగనాథరాజు పరామర్శ



మార్టేరులో ఆదిలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



సిద్ధాంతంలో నక్కా శ్రీను కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామ ఉప సర్పంచ్ కర్రి వేణుబాబు తల్లి ఆదిలక్ష్మి ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు మార్టేరు వెళ్లి వేణుబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ బహుజన కులాల నాయకుడు చింతపల్లి గురుప్రసాద్, రాష్ట్ర విద్య మౌలిక వసతుల కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవరెడ్డి, సర్పంచ్ మట్టాకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి ఉన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పెనుగొండ ఎంపీటీసీ సభ్యుడు నక్కా పద్మ శ్రీను మామయ్య సూర్యనారాయణ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, సిద్ధాంతంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను శనివారం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. అనంతరం ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న చెరుకువాడలో సుంకర కుబేరుడును పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యుడు చిన్నం ఏడుకొండలు, ఎస్సీ సెల్ మండల కన్వీనరు పలివెల శ్రీను, పార్టీ నాయకులు పోదూరి రామయ్య, తిక్కిరెడ్డి పవన్‌కుమార్, చింతపల్లి ప్రసాద్, గాజుల బులి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో రోటరీ ముందంజ



నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: విద్య, వైద్య, సామాజిక సేవా రంగాల్లో రోటరీక్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుత్తికొండ శ్రీరామ్ అన్నారు. శనివారం రాత్రి పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో జరిగిన రోటరీక్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో శ్రీరామ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడిగా రావాడ వెంకట సత్యనారాయణ మూర్తి (సతీష్), కార్యదర్శిగా జవ్వాజి కల్యాణ్, కోశాధికారిగా పోతాబత్తుల సత్యనారాయణలతో శ్రీరామ్ పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. గత ఏడాది పాలకొల్లు రోటరీక్లబ్ నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గాను క్లబ్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు, 16 ఉత్తమ సేవా అవార్డు వచ్చినందుకు గాను మాజీ అధ్యక్షుడు పెనుమాక రామమోహన్ రావు, కార్యవర్గ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. నూతన కార్యవర్గ సభ్యులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో భాగంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, కెరియర్ గైడ్స్, పేద విద్యార్థికి కొత్త సైకిల్, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థికి రూ.24వేల మెరిట్ స్కాలర్‌షిప్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, మద్దాల రాంప్రసాద్, ఇమ్మిడి రాజేష్, డా.ముచ్చర్ల సంజయ్, కావలి నగేష్, మైగాపుల రాంబాబు, చందక రాము, కఠారి నాగేంద్రకుమార్, గంగాధర్, గన్నాబత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇద్దరికి డాక్టరేట్‌ల ప్రదానం



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న డీటీడీసీ బాబు



బెంగళూరులో డాక్టరేట్ అందుకుంటున్న నూలి శ్రీనివాస్

పోడూరు: ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ పాలకొల్లు ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్, వైసీపీ నాయకుడు డీటీడీసీ బాబుకు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలోని ఓసూర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు. సామాజిక, ఆధ్యాత్మిక సేవలకు గాను డీటీడీసీ బాబుకు డాక్టరేట్‌ను అందజేశారు. డీటీడీసీ బాబును వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి, జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళిసాగర్, సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి తదితరులు అభినందించారు.

నూలి శ్రీనివాస్‌కు డాక్టరేట్

నరసాపురం: పట్టణంలోని బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్‌కు అరుదైన గౌరవం లభించింది. అటు విద్యారంగం ఇటు సామాజిక సేవారంగాల్లో చేస్తున్న కృషికి గాను ఏసియా ఇంటర్నేషనల్ రీసెర్చ్ అకాడమీ గౌరవ డాక్టరేట్ అందించింది. బెంగళూరులోని అకాడమీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ డాక్టరేట్‌ను అందుకున్నారు.

శాకంబరిగా దుర్గమ్మ



శాకరంబరి అలంకరణలో దుర్గమ్మ

నరసాపురం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని శనివారం శాకంబరి దేవిగా అలంకరించారు. తహసీల్దార్ కార్యాలయ మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో అమ్మవారికి చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో భక్తుల రావడంతో ప్రధాన రహదారి మొత్తం మధ్యాహ్నం వరకూ భక్తులతో కిక్కిరిసి ఉంది. ముఖ్యంగా స్వామి వారిని అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది.

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం

పెనుమంట్ర: మండలంలోని భట్లమగుటూరు గ్రామంలో విరిబ్యాక్ కంపెనీ రూ. 6లక్షలతో నిర్మించిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను శనివారం ఆచంట ఎమ్మెల్యే, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ భయ్యే సుగుణమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విరిబ్యాక్ రీజినల్ బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ, పూర్ణసాయి, తాడి వెంకట శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్‌కు ఘన నివాళి



కలాం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మొగల్తూరు: కలలు కనండి వాటిని సాకారం చేసుకోండని యువతను మేలుకొల్పిన అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలలోని అబ్దుల్ కలాం విగ్రహానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రామరాజు, ఉపాధ్యాయులు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశ ప్రతిష్టను నిలబెట్టిన వ్యక్తి అబ్దుల్ కలామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో వాటాల మాధవరాజు, రాజేంద్ర బాబు, నాగిడి రాంబాబు, బర్రి శ్రీను,దొంగ రాంప్రసాద్, దొంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడమే లక్ష్యం



పెనుమంట్ర: పెనుమంట్రలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ ఎ.కృష్ణకుమారి



పాలకొల్లు అర్బన్: పందిగుంటలో మిషన్ శక్తి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



యలమంచిలి: గుంపర్రు హైస్కూల్లో మిషన్ శక్తిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: అంగన్‌వాడీ కార్యకర్తలు కిశోర బాలికల్లో అవగాహన కల్పించి బాల్యవివాహాలను అరికట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కె.కృష్ణకుమారి అన్నారు. శనివారం ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన మిషన్‌శక్తి 100 రోజుల అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికలు లైంగిక వేధింపులకు గురికాకుండా ఎప్పటికప్పుడు వారిలో అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో సఖి స్టాఫ్ సెంటర్ కౌన్సిలర్ పి.పూజ, సూపర్‌వైజర్లు ఎస్.వెంకటలక్ష్మి, పి.వరలక్ష్మి, పి.పోసమ్మ, ఎం.విజయకుమారి, వి.రూత్‌కుమారి, ఎం.శ్యామలాంబ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంఎన్ మల్లీశ్వరి అన్నారు. పాలకొల్లు మండలం పందిగుంటలో మిషన్ శక్తి 100 కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులు, కిశోరబాలికలు, బాలింతలతో నిర్వహించిన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లీశ్వరి బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బి.అభిరాణి, ఏఎన్ఎం సరళా ప్రకాష్ పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: ప్రతి మహిళా ఆత్మగౌరవం కాపాడుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి.నాగరత్నం కోరారు. గుంపర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శనివారం ఆమె బేటీ బచావో–బేటీ పడావో మిషన్ శక్తి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మహిళా చట్టాలపై అవగాహనతో ఉండాలని సూచించారు.